క్లుప్తంగా

మరింత కట్టుదిట్టంగా పోలీసుల రాత్రి గస్తీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ కమిషనరేట్‌ పోలీసులు రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా నగరంలో ముమ్మర గస్తీ, అనుమానిత వ్యక్తులు, నంబర్‌ లేని వాహనాల గుర్తింపు, అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పోలీసులను పోలీస్‌ కమిషనర్‌ ఎస్‌.వి.రాజశేఖరబాబు ఆదేశించారు. దీంతో రాత్రి గస్తీని పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. ప్రత్యేకంగా పోలీసు బృందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేస్తున్నారు. లాడ్జీలు, హోటళ్లు, నిర్జన ప్రదేశాల్లో తరుచూ క్షుణ్ణంగా సోదాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌ స్టేషన్ల పరిధిలో ఉన్న ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఆయా పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు తమ సిబ్బందితో రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానిత వాహనదారులకు డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు చేస్తున్నారు.

దుర్గమ్మకు కళార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల నేపథ్యంలో బుధవారం పలువురు కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద బుధవారం ఉదయం పలువురు భక్తులు కోలాటం, అమ్మవారి నామ సంకీర్తన, భజనలు నిర్వహించారు. సాయంత్రం విజయవాడకు చెందిన ఎస్‌.శివకుమార్‌ పర్యవేక్షణలో 12 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థలు చేయూత ఇవ్వాలని వైఎస్సార్‌ సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌కుమార్‌ సూచించారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్‌ లారీ ఓనర్స్‌ ఫౌండేషన్‌ అందించిన పుస్తకాలను ఆయన భవానీపురం ఆకుల రాజేశ్వరరావు మిల్‌ రోడ్‌లోగల కనుమర్లపూడి సుబ్బారావు మున్సిపల్‌ ఎలిమెంటరీ స్కూల్‌ విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్‌ కుమార్‌ మాట్లాడుతూ.. విద్యతోనే ఏదైనా సాధించవచ్చని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలను అందుకున్న ఎందరో మహనీయులు నిరూపించారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తోడ్పాటు అందించాలని కోరారు.

స్నానఘాట్, ఘాట్‌రోడ్డులో దుర్గగుడి ఈఓ తనిఖీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో శీనానాయక్‌ బుధవారం స్నానఘాట్, ఘాట్‌రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. తొలుత ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్‌ వద్ద చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్‌ కౌంటర్లను పరిశీలించారు. అనంతరం దేవస్థాన బస్టాప్‌ సమీపంలోని ప్రసాదాల కౌంటర్‌ను పరిశీలించిన ఈవో అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దేవస్థాన బస్సులో కొండ దిగువకు చేరుకున్న ఈవో స్నానాల ఘాట్‌ను పరిశీలించారు. స్నానఘాట్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మైక్‌ ప్రచార కేంద్రం, సమాచార కేంద్రాలను చూశారు. ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించామని ఈవో పేర్కొన్నారు. ఈవో వెంట అసిస్టెంట్‌ కమిషనర్, ఇంజినీరింగ్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతబస్తీలో యథేచ్ఛగా ఆక్రమణలు

- ఏ రోడ్డులో చూసినా ట్రాఫిక్‌ కష్టాలే
- అల్లాడుతున్న వాహనచోదకులు
- పాదచారులకు సైతం తప్పని ఇబ్బందులు



ఆక్రమణల కారణంగా బ్రాహ్మణవీధిలో బారులు తీరిన వాహనాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ వాసులు ఆక్రమణలతో అల్లాడుతున్నారు. వీధులు అన్నింటిని వాహనాలతో ఇతర దుకాణాలతో ఆక్రమించటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పాతబస్తీలో ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు యావత్‌ పాతబస్తీ వీధులు అన్నింటిలోనూ వాహనాల సంగతి పక్కన పెడితే కనీసం పాదచారులు సైతం స్వేచ్ఛగా నడిచి వెళ్లలేని పరిస్థితులు నెలకున్నాయి. ఎటు చూసినా రోడ్డును ఆక్రమించి ఉండటంతో వాహన చోదకులు చక్కగా ముందుకు వెళ్లలేక గంటలకొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్నారు. వీటిపై అటు పోలీసు శాఖ, ఇటు నగరపాలకసంస్థ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

లక్షలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతం

పాతబస్తీలో వేలాది దుకాణాలు ఉన్నాయి. ఇరుకు వీధులు, చిన్నచిన్న దుకాణాలతో నిత్యం వినియోగదారులతో పాతబస్తీ రద్దీగా దర్శనమిస్తుంది. ఈ పాతబస్తీలోని వ్యాపార దుకాణాలకు నిత్యం లక్షలాది మంది వినియోగదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వారంతా పాతబస్తీ వీధుల్లో ఉన్న ఆక్రమణలతో అల్లాడుతున్నారు. బ్రాహ్మణవీధి, శివాలయం వీధి, మెయిన్‌ బజార్, రాంగోపాల్‌వీధి, పులిపాటి వారి వీధి, శేషయ్యవీధి, భావనారాయణ వీధి ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. కొనుగోలుదారుల మాట అటుంచి స్థానికులు సైతం రాకపోకలు సాగించాలంటే నానా తంటాలు పడాల్సి వస్తోంది.

పోలీసుల నిఘా పెరగాలి

వ్యాపారులు ఏ విధమైన వ్యాపారం చేసుకున్నా ఆ పరిసరాల్లో ట్రాఫిక్‌ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా పోలీసు శాఖ సరైన పర్యవేక్షణ లేకపోవటంతో పాతబస్తీలో రాకపోకలు సాగించాలంటే నరకం కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధాన వ్యాపార కేంద్రాలైన శివాలయం వీధి, భావనారాయణ వీధి, పులిపాటి వారి వీధి, మెయిన్‌ బజార్, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల్లో సరైన పర్యవేక్షణ ఉంటే ట్రాఫిక్‌ సమస్యలకు చెక్కు పెట్టినవారవుతారని స్థానిక నివాసితులు చెబుతున్నారు. ఆ దిశగా పోలీసు శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని పాతబస్తీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి సైతం వేలాది మంది రాక

పాతబస్తీలోనే ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ కొలువై ఉంది. అమ్మవారి దర్శనార్థం నిత్యం వేలాది మంది పాతబస్తీలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పాతబస్తీలోని ఆలయ పరిసర ప్రాంతాలతో పాటుగా కెనాల్‌ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఆక్రమణలు భారీగానే ఉన్నాయి. ఆక్రమణల కారణంగా భక్తులు సైతం ఇక్కట్లపాలవుతున్నారు. రథం సెంటర్‌లో ఇటీవల కొన్ని ఆక్రమణలను తొలగించినా ఇంకా పరిస్థితులలో మార్పు రాలేదు. ప్రధానంగా రథం సెంటర్‌ నుంచి నెహ్రూబొమ్మ సెంటర్‌ వరకూ ఉన్న బ్రాహ్మణవీధిలో దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. కొంతమంది వాహనాలను పూర్తిగా రోడ్డు పైన పార్కింగ్‌ చేయటం, వాటికి సరైన నియంత్రణ లేకపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ ఎదుట నిరసన తెలిపిన సంఘ్‌ నేతలు



విజయవాడ రైల్వే స్టేషన్‌ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్‌ సంఘ్‌ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సార్వత్రిక సమ్మెలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్‌ సంఘ్‌ విజయవాడ డివిజన్‌ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌ ఎదుట కార్మికులు బుధవారం నిరసన చేపట్టారు. సంఘ్‌ అసిస్టెంట్‌ జనరల్‌ సెక్రటరీ యడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. ఎనిమిదో సెంట్రల్‌ పే కమిషన్‌ కమిటీ వెంటనే నియమించాలని కోరారు. సంఘ్‌ విజయవాడ డివిజన్‌ అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్‌ పెన్షన్‌ స్కీం (యూపీఎస్‌), నూతన పెన్షన్స్‌ స్కీం (ఎన్‌పీఎస్‌)ను రద్దుచేసి పాత పెన్షన్‌ స్కీం (టీపీఎస్‌) విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. రైల్వేల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, బకాయిపడిన 18 నెలల డీఏను వెంటనే చెల్లించాలని, బోనస్‌పై సీలింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని, సీ అండ్‌ డబ్ల్యూ డిపోల్లో పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా కొత్త పోస్టులు, కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్‌ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయమైన కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్‌ సంఘ్‌ సెంట్రల్‌ వర్కింగ్‌ కమిటీ సభ్యులు ఎ.రమేష్, దేగల శ్రీను, సీ అండ్‌ డబ్ల్యూ బ్రాంచ్‌ కార్యదర్శి కర్నూల్‌ సుకుమార్, చైర్మన్‌ వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్‌ బ్రాంచ్‌ కార్యదర్శి ఎం.ఎస్‌.రావు, రమణారెడ్డి, శ్రీనివాసరావు, బాలాజీ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి పూర్తిస్థాయి వైద్య పరీక్షలు



సిబ్బందికి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని పలు ఆస్పత్రుల్లో పోలీస్‌ సిబ్బందికి కంప్లీట్‌ హెల్త్‌ చెకప్‌ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. రోజుకు 250 మంది చొప్పున మొత్తం నాలుగు వేల మంది పోలీసు సిబ్బంది, అధికారులు, హోం గార్డులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. నగరంలోని ఆంధ్రా హాస్పిటల్, మెడ్‌స్టార్, కామినేని, క్యాపిటల్, సెంటినీ, హెల్ప్‌ హాస్పిటల్స్‌లో సిబ్బందికి కంప్లీట్‌ హెల్త్‌ చెకప్‌ పరీక్షలు నిర్వహించారు. పలు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలను పోలీస్‌ కమిషనర్‌ ఎస్‌.వి.రాజశేఖరబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ జనరల్‌ బాడీ హెల్త్‌ చెకప్, డయాబెటీస్, కిడ్నీ ప్రొఫైల్, లిపిడ్‌ ప్రొఫైల్, గుండె పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించిన వారికి వైద్య చికిత్సల అనంతరం సంపూర్ణ ఆరోగ్యంగా విధులకు హాజరు కావాలని సూచించారు. రోజూ 250 మందికి ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. డీసీపీ కె.జి.వి.సరిత పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పరీక్షలకు ఏఆర్‌ ఏడీసీపీ కె.కోటేశ్వరరావును నోడల్‌ ఆఫీసర్‌గా సీపీ రాజశేఖరబాబు నియమించారు. ఆరోగ్య పరీక్షలకయ్యే ఖర్చును పోలీస్‌ కమిషనరేట్‌ ఫండ్‌ నుంచి చెల్లించనున్నారు.

సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు



కృష్ణానది నుంచి కలశాలతో జలం తీసుకొస్తున్న మహిళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని భవానీపురం హౌ సింగ్‌బోర్డ్‌ కాలనీలో ఉన్న సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో రెండో రోజు బుధవారం విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఉదయం ఆరు గంటలకు భక్తులు చెరుకు రసంతో సాయిబాబాను అభిషేకించారు. ఏడు గంటలకు పుష్పాలతో సహస్రనామార్చన చేశారు. అనంతరం 108 మంది ముత్తయిదువులు, కన్యలు 108 కలశాలతో కృష్ణానది జలాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి బాబా చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం కలశాల్లోని కృష్ణాజలంతో సాయినాథుడికి జలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాలను మందిరం పాలకమండలి బాధ్యులు బూర్లె వెంకటేశ్వరరావు, ఊటుకూరి శివనారాయణ, మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, యందలూరు రాజశేఖర్, పెండేల వెంకట లక్ష్మీప్రసాద్, గుడివాడ విజయకుమార్‌ తదితరులు పర్యవేక్షించారు. 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అంటూ మందిరంలో కొనసాగుతున్న అఖండ సాయినామ సంకీర్తనలో భక్తులు పాల్గొన్నారు.

చావు బతుకుల్లో ఉన్న బిడ్డను రక్షించాలని వినతి



బిడ్డను రక్షించమంటూ చేతులు జోడించి వేడుకుంటున్న శిరీష, కుమార్‌

భవానీపురం(విజయవాడపశ్చిమ): గుండె జబ్బుతో బాధపడుతున్న తమ బిడ్డ అన్విత (7) వైద్యానికి సహాయం అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు బోయిళ్ల శిరీష, స్పందన్‌ కుమార్‌ కన్నీటితో వేడుకుంటున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్‌ కేఎల్‌రావునగర్‌ 6వ లైన్‌లో నివసిస్తున్న ఆ దంపతుల కూతురు చిన్నారి అన్విత రెండేళ్ల నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గత నెలలో చెన్నైలోని పద్మావతి హాస్పిటల్‌కు చిన్నారిని తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు ఎంజీఎం హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించినట్లు తల్లి శిరీష బుధవారం మీడియాకు వెల్లడించారు. అక్కడికి తీసుకువెళ్లి చూపించగా గుండె మార్పిడి చేయాలని, రూ.55 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని వివరించారు. ఈ నెల మూడోవారం లోపల హాస్పిటల్‌ చేర్పించాలని వారు సూచించినట్లు పేర్కొన్నారు. లేని పక్షంలో గుండె నుంచి బ్రెయిన్, కిడ్నీ, లివర్, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతాయని డాక్టర్లు స్పష్టం చేశారని, చావు బతుకుల్లో ఉన్న తమ బిడ్డను మీ బిడ్డగా భావించి తోచిన ఆర్థిక సాయాన్ని అందించాలని కన్నీటి పర్యంతమయ్యారు. దాతలు 91548 43221 మొబైల్‌ నంబరులో సంప్రదించాలని వేడుకున్నారు.

నేటి నుంచి బెజవాడ బిజినెస్‌ ఎక్స్‌పో

13వ తేదీ వరకు నిర్వహణ



బెజవాడ బిజినెస్‌ ఎక్స్‌పో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్‌): సత్యనారాయణపురం భగత్‌సింగ్‌ రోడ్డులోని నాడార్స్‌ ఫంక్షన్‌ హాల్‌లో గురువారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు బెజవాడ బిజినెస్‌ ఎక్స్‌పో పేరిట, మహిళలు, స్వయం సహాయ సంఘాలు, వ్యాపార, పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని నిర్వాహకులు గంగరాజు సూర్యకుమారి, కొప్పవరపు ఉమాబలరామ్‌ తెలిపారు. స్థానిక సత్యనారాయణపురం నాడార్స్‌ ఫంక్షన్‌ హాల్‌లో బుధవారం బెజవాడ బిజినెస్‌ ఎక్స్‌పో కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపారులు, పారిశ్రామిక వర్గాలకు చెందిన వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించటంతో పాటు ఉత్పత్తి ధరలకే విక్రయిస్తారన్నారు. మహిళల దుస్తులు, ఫుడ్‌ ప్రొడక్ట్స్, ఆయుర్వేద ఉత్పత్తులు, పచ్చళ్లు, పొడులతో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ప్రతి ఏటా తాము ఏర్పాటు చేస్తున్న బెజవాడ బిజినెస్‌ ఎక్స్‌పోను సందర్శించి మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు శిష్టా కుసుమ లావణ్య, రాజంపూడి అమూల్య, రాచకొండ లక్ష్మి, కస్తూరి హనుమంతరావు, వాడ్రేవు సుబ్బారావు, కొప్పవరపు బలరామ్, దత్త ప్రసాద్, రాజంపూడి మల్లిక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫొటో బూత్‌లు



తాము తయారు చేసిన ఫొటో బూత్‌లతో విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్‌సీ హైస్కూల్‌ విద్యార్థులు తయారు చేసిన ఫొటో బూత్‌లో ఆకట్టుకుంటున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్‌ మీటింగ్‌కు హాజరయ్యే తల్లిదండ్రులతో కలిసి ఫొటో (సెల్ఫీ) దిగే విధంగా విద్యార్థులు ఈ ఫొటో బూత్‌లను రూపొందించారు. వాటిని మీటింగ్‌లో ప్రదర్శించేందుకు బుధవారం పాఠశాలలో సన్నాహాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి.రవికుమార్‌ మాట్లాడుతూ పాఠశాల బస్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు వంటి వివిధ అంశాలతోకూడిన ఫొటో బూత్‌లను తయారు చేశారని తెలిపారు. వీటిని రూపొందించటంలో విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయునులు లత, ఆస్మా భాను, తల్లిదండ్రులు సహకరించారని పేర్కొన్నారు. పాఠశాలలో గురువారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్‌ మీటింగ్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

మద్యం అక్రమ విక్రేతపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్‌): నున్న పోలీసు స్టేషన్‌ పరిధి ఉడా కాలనీలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పసల సువర్ణ (40) అనే మహిళ ఉడా కాలనీలో ప్లాట్‌ నంబరు 33 వద్ద బాటిల్‌కు రూ.30 వంతున అదనంగా రేటు పెంచి మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆమె నుంచి మద్యం బాటిల్స్‌ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రూట్స్‌ హెల్త్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ పోలవరపు విజయభాస్కర్‌ సూచించారు. స్థానిక ఐటీఐ రోడ్డులోని సర్వోదయ మండల్‌ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ తేలప్రోలు, సర్వోదయ మండల్‌ ఎన్టీఆర్‌ జిల్లా కమిటీ సంయుక్తంగా ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం జరిగింది. విజయ్‌భాస్కర్‌ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనిషి ప్రాణం రక్తంలోనే ఉందని, రక్తదానంపై అపోహలు వీడి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. సర్వోదయ మండల్‌ రాష్ట్ర అధ్యక్షుడు నీలం రాంబాబునాయుడు మాట్లాడుతూ.. ఒక మనిషి ప్రాణం నిలబెట్టడానికి వైద్యుడే కానవరం లేదని రక్తం దానంతోనూ ఆ పని చేయొచ్చని పేర్కొన్నారు. సర్వోదయ మండల్‌ జిల్లా కమిటీ చైర్మన్‌ నెట్టెం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామాజిక సేవను ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ తేలప్రోలు అధ్యక్షురాలు మోదుగు ఉమాదేవి, ఎన్టీఆర్‌ సర్వోదయ మండలి రాష్ట్ర కమిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ వల్లూరు లత, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ గోగు రవికుమార్, కె.రమేష్, సభ్యులు ప్రదీప్‌దాస్, జింకా లలిత, బత్తిన జ్యోతిర్మయి, గవిరెడ్డి సీతామహాలక్ష్మి, జ్యోతితో పాటు 22 మంది రక్తదానం చేశారు.

నగరంలో మోడల్‌ ఫ్లవర్‌ మార్కెట్‌ ఏర్పాటు



హోల్‌సేల్‌ పూల వ్యాపారులతో సమావేశమైన కలెక్టర్‌ లక్ష్మీశ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్‌): హోల్‌ సేల్, రిటైల్‌ పూల వ్యాపారులు, వినియోగదారులకు ఆమోద యోగ్యంగా మోడల్‌ ఫ్లవర్‌ మార్కెట్‌ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు కలెక్టర్‌ డాక్టర్‌ జి.లక్ష్మీశ చెప్పారు. నిబంధనలకు లోబడి హోల్‌ సేల్‌ పూల మార్కెట్‌ వర్తక సంక్షేమ సంఘమే మార్కెట్‌ నిర్మించుకోవాలన్నారు. హోల్‌ సేల్‌ పూల మార్కెట్‌ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూల మార్కెట్‌ నిర్మాణంపై బుధవారం కలెక్టరేట్‌లోని తన సమావేశ మందిరంలో మార్కెటింగ్, ఉద్యాన, నగరపాలక సంస్థ, పూల వర్తక సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. జీఎస్‌ రాజు రోడ్డులోని రైతు బజారుకు చెందిన 80 సెంట్లలో హోల్‌ సేల్‌ పూల మార్కెట్‌ను నిర్మించాలనే ఆలోచన చేశామన్నారు. రైతు బజార్‌ను తొలగించి ప్రభుత్వ, ప్రైవేట్‌ భాగస్వామ్యంతో పూల మార్కెట్‌ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. మార్కెటింగ్‌ శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ బి.రాజాబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.బాలాజీ కుమార్, నగరపాలక సంస్థ ఎస్టేట్‌ అధికారి ఎ.శ్రీధర్‌ హోల్‌ సేల్‌ పూల మార్కెట్‌ వర్తక యాజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్‌ రఫీ తదితరులు పాల్గొన్నారు.

13న ఫ్లోర్‌ పెయింటింగ్‌ పోటీలు

పటమట(విజయవాడతూర్పు): నగర విశిష్టతను వివరించేలా పర్యాటక ప్రదేశాల్లో ఫ్లోర్‌ పెయింటింగ్‌ పోటీలు నిర్వహిస్తున్నామని మునిసిపల్‌ కమిషనర్‌ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా, నగరంలోని ప్రధాన పర్యాటక ప్రదేశమైన బరంపార్కు వద్ద సుందరీకరించే దిశగా ఈ నెల 13వ తేదీన ఈ పోటీలు రెండు కేటగిరీల్లో జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి కేటగిరీలో 12 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్నవారు నేల పైన పెయింటింగ్‌ వేయాలని సూచించారు. రెండో కేటగిరీలో 12 ఏళ్ల కంటే తక్కువ వయసుగల పిల్లలు డ్రాయింగ్‌ పోటీల్లో పాల్గొన్నాలని పేర్కొన్నారు.

• శాకంబరీ నమోస్తుతే..



కూరగాయలతో ఏర్పాటుచేసిన దేవతామూర్తుల ప్రతిమలు

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శాకంబరి అలంకారంలో కొలువైన దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో బుధవారం పండుగ వాతావరణం కనిపించింది. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



శాకంబరి అలంకరణలో ఉన్న దుర్గమ్మ ఉత్సవమూర్తిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు



కాయగూరలతో అలంకరించిన దుర్గమ్మ అంతరాలయం



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు